క్లుప్తంగా

23న పోట్లూరు తిరునాళ్ల వేడుకలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం తిరునాళ్ల వేడుకలు ఈనెల 23న వైభవంగా గ్రామస్తులు నిర్వహించుతారు.తిరునాళ్ల వేడుకలు సందర్భంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే ఏరియాను ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ప్రభలు ఏర్పాటు చేయు నిర్వాహకులు పోలీసులు అనుమతి తప్పనిసరి అన్నారు. శాంతి భద్రతలు విఘాతం కల్గకుండా అందరు సహకరించాలని ఎస్సై అన్నారు.

నేత్రదానం అభినందనీయం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన పారా హనుమాయమ్మ (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వారి అనుమతితో మృతురాలు నేత్రాలను పెద కాకాని శంకర కంటి వైద్యశాల నేత్ర నిధికి దానం చేసినట్లు జిల్లా అమ్మ సొసైటి కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా నేత్రాలు దానం చేయటం వలనమరొకరికి చూపు వచ్చేలా చేస్తుందన్నారు. శరీర అవయవ దానం చేయటం వలన మరొకరుకు ప్రాణం పోస్తుందన్నారు. శంకర కంటి వైద్య నిపుణులు సారథ్యంలో కార్నియా పొరలను ఆపరేషన్ చేసిన తదుపరి ప్రత్యేకంగా బాక్సులో తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పిచ్చయ్య, వీరాంజినేయులు, మల్లేశ్వరి, సామ్రాజ్యం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో గుండా అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి పొందడమే కాకుండా నలుగురికి ఆదర్శంగా నిలవాలని రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షుడు గుండా అశోక్ బాబు అన్నారు. పట్టణంలోని ఎల్ఎస్ పిక్చర్ ప్యాలెస్ పక్కన సెక్రటరీ నీరుమళ్ల రాజేష్ ఇంటి వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లను అందించారు. ఈ సందర్భంగా గుండా అశోక్‌బాబు మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి కోసం మిషన్ల పంపిణీ చేశామన్నారు. పొట్టి భాస్కర్ (యూఎస్ఏ) ఆర్థిక సాయం చేయడంతో 10 మిషన్లు మహిళలకు అందించామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, భవనాశి నరసింహారావు, కాకుమాను శ్రీనివాసరావు, ఎస్. ముత్తారెడ్డి, ఏలూరి పుల్లారావు, గర్నె సుబ్రహ్మణ్యం, గుండా గురవయ్య, పసుమర్తి రమేష్, కొత్త రవి, హరికృష్ణ, ఎస్‌కే మౌలా సాహెబ్, మాచర్ల శ్రీనివాస్, వంకాయల గోపీ, ఈవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు మంచి భరోసా

- ఊరిలోనే ఉన్నత విద్య
- ప్లస్–2 జూనియర్ బాలికా కళాశాల నాడే అంకురార్పణ
- గ్రామాల్లో ముమ్మర ప్రచారం
- వేగంగా అడ్మిషన్ల ప్రక్రియ



యడ్లపాడు జెడ్పీ హైస్కూల్, ప్లస్-2 జూనియర్ కళాశాల భవనం

యడ్లపాడు: ఒకప్పుడు పదో తరగతి పూర్తయిన బాలికలకు మళ్లీ చదువుకోవడం అంటే చాలామంది కుటుంబాలకు పెద్ద భారమే. పొద్దున్నే లేచి మైళ్ళ దూరం ప్రయాణం చేయాలి, ఖర్చు భరించాలి... ఇలా ఎన్నో అవస్థలు. ఇప్పుడు అలా కాదు. బాలిక విద్యకోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో, మాజీమంత్రి విడదల రజిని నేతృత్వంలో యడ్లపాడు గ్రామస్తుల సుదీర్ఘ కల నెరవేరింది. 2023లో స్థానికంగానే జెడ్పీహైస్కూల్ ఏర్పాటుతో పాటు ఇదే ప్రాంగణంలో బాలికల కోసం ప్రత్యేకంగా హైస్కూల్ ప్లస్-2 జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ కళాశాల వల్ల గ్రామీణ బాలికలు సొంత ఊరిలోనే ఇంటి దగ్గరే ఇంటర్ చదువుకునే అవకాశం అందుకున్నారు. దీంతో మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమే కాదు, గ్రామీణ బాలికల ఉన్నత విద్యను అభ్యసించాలన్న కల సాకారమవుతోంది. స్థానికంగానే ఇంటర్ విద్యను పూర్తి చేసిన తొలిబ్యాచ్ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాలతో ఆనందం

పదితోనే విద్యకు ఫుల్‌స్టాప్ పడుతుందని భావించిన బాలికలు ఇప్పుడు ఇంటర్ విద్యను పూర్తి చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో 2024–25 ఫస్టియర్ విద్యార్థులు 32 మంది పరీక్షలు రాయగా వీరిలో 14 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో డి. లక్ష్మీగాయత్రి 410 మార్కులతో టాపర్‌గా నిలవగా, డి. పూజిత 393 మార్కులు, కె. గోపెమ్మ 382 మార్కులతో తరువాతి స్థానాల్లో నిలిచారు. అలాగే సెంకడియర్ ఇంటర్‌లో...23 మంది పరీక్షలకు హాజరై 15 మంది ఉత్తీర్ణులు కాగా, ఎం. శివ పార్వతి 867 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలవగా, ఆర్.ఝాన్సీ 863, డి.నందు 844 మార్కులతో తర్వాతి స్థానాల్లో మెరిశారు. ఫస్టియర్ విద్యార్థినులు 44 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీటిలో ఎంపీసీలో 15 మందికి ఆరుగురు ఉత్తీర్ణత పొంది 40 శాతం, బైపీసీలో 17 మందికి 8 మంది ఉత్తీర్ణులై 47 శాతం నమోదు చేశారు. అలాగే సెకండీయర్ విద్యార్థినులు 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 10 మందికి గానూ ఏడుగురు ఉత్తీర్ణులై 70 శాతం, బైపీసీలో 13 మందికి 8 మంది ఉత్తీర్ణులై 62 శాతం నమోదు చేయడం విశేషం.



విద్యార్థినికి కళాశాల ప్రచార పత్రం అందజేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే



సెకండియర్ ఇంటర్ బైపీసీలో 867 మార్కులతో కళాశాల టాపర్‌గా రావడం గర్వంగా ఉంది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయడం వల్లనే ఈ మార్కులు సాధించడం జరిగింది. బాలికలు స్థానికంగానే ఉన్న ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం శివపార్వతి, బైపీసీ

ఆనందంగా ఇంటర్ పూర్తయ్యింది



పది తర్వాత పట్టణాలకు వెళ్లి చదవాలంటే బాలికలకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. యడ్లపాడులోనే కళాశాల ఏర్పాటు, అందులోనూ బాలికలకు ప్రత్యేకం కావడంతో హ్యాపీగా రెండేళ్ల ఇంటర్‌విద్యను పూర్తి చేశాం. సెకండీయర్‌లో ఎంపీసీలో 863 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది.

–ఆర్ ఝాన్సీ, ఎంపీసీ

సమష్టి కృషివల్లే సాధ్యమైంది



కళాశాల ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు, వారి కుటుంబ సభ్యులను కలిసి ఉన్నత విద్యను కొనసాగించాలని చైతన్యం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. సమష్టి కృషితో భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలను సాధిస్తాం.

–జి విజయభారతి, హెచ్‌ఎం యడ్లపాడు జెడ్పీహైస్కూల్





యడ్లపాడు మేదర వీధిలో నేలవాలిన వేపచెట్టు

రెండు శతాబ్దాలుగా నీడనిచ్చి...

రెండు శతాబ్దాల నాటి మహావృక్షం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో సమీపంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. యడ్లపాడు గ్రామంలోని మహేంద్ర సంగం మేదరబజారులో కూడలిలో భారీ వేపచెట్టు ఉంది. స్థానికులు ఈ వృక్షం చుట్టూరా దిమ్మెకట్టించి మహాలక్ష్మి అమ్మవారిగా కొలుస్తున్నారు. మేదర వృత్తి పనులు చేసుకుంటూ ఈ చెట్టుకు నిత్యం ఉదయం పూజలు చేస్తూ, సాయంత్రం వేళ అక్కడ కూర్చుని పనులు చేసుకునే వారు. ఈదుర గాలులు వీచినా, భారీ వర్షాల సమయంలోనూ ఈ చెట్టు కొమ్మలు సైతం విరగలేదు. ఆదివారం ఉదయం గాలులుకాని, వర్షాలు గాని లేకుండానే దానంతట అదే ఒక్కసారిగా మొదలు వద్ద విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాల తీగలపై ఒక్కసారిగా పడటంతో తెగిపోయాయి. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. చెట్టు విరిగి పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

– యడ్లపాడు

మట్టి తవ్వకాలపై అధికారుల కన్నెర్ర

- ఉన్నవ ఆచార్యుల చెరువులో తవ్వకాలు
- మూడు జేసీబీలు, 18 ట్రాక్టర్లు సీజ్



యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతంలో మూడు శాఖల అధికారులు ఆకస్మిక దాడి ఆదివారం నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదేశాల మేరకు యడ్లపాడు మండల రెవెన్యూ, నరసరావుపేట మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో కలిసి ఈ దాడి చేసినట్లు తెలిపారు. ఉన్నవ గ్రామంలోని సర్వేనంబర్ 281 ఆచార్యుల చెరువులో ఈ అక్రమ తవ్వకాలు చేస్తున్నట్లు వివరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా, అక్రమంగా మట్టిని తవ్వి, తరలిస్తున్న 3 జేసీబీలు, 18 ట్రాక్టర్లు పట్టుకొని సీజ్ చేయటం జరిగింది. దీనిపై యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, జియాలజిస్ట్ అనిల్‌బాబు, అగ్రికల్చరల్ ఆఫీసర్ ఆదినారాయణ, మైన్స్ అండ్ జియాలజిస్ట్ అధికారిణి నాగిని ఉన్నారు.

నిత్యావసర సరకులు అందజేత



వస్తువులు అందజేస్తున్న దృశ్యం

మాచర్ల: వెల్దుర్తి మండలంలోని మండాది గ్రామంలో దేరంగుల కుమారి అనే క్యాన్సర్ పేషెంట్‌కు నిత్యావసర వస్తువులు అందజేశారు. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, రాష్ట్ర మహిళా బీసీ సంక్షేమ విభాగం అధ్యక్షురాలు జ్యోతి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ పాపిరెడ్డి, శ్రీనివాసరావులు సహాయం అందించారు.

ప్రభుత్వ వైఫల్య ఫలితమే కార్మికుల నిరసన దీక్షలు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాల్మన్
- 32వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల నిరసన
- అధికారులు స్పందించి న్యాయం చేసే వరకూ పోరాడతాం



శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలియచేసిన సాల్మన్

నరసరావుపేట: ఆప్కాస్‌లో ఉన్న తమను బదిలీ కార్మికులమంటూ వేధింపులకు పాల్పడడం ఏ మాత్రం తగదని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందుతున్నారు. గత ఆరేళ్లుగా మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్నామని, అయినప్పటికీ ప్రతి నెల 10 నుంచి 15 రోజులకు మాత్రమే వేతనాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారంతో 32వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సంఘీభావం తెలిపిన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కార్మికులు 32 రోజులుగా పోరాటం చేస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని న్యాయంగా తమకు రావలసిన వేతనాలను సక్రమంగా ఇవ్వాలని మాత్రమే అడుగుతున్నారని దీనికై పోరాటం చేయాల్సిన రావటం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఆప్కాస్‌లో పేర్లు నమోదైతే బదిలీ కార్మికులను ఎలా అంటారని ప్రశ్నించారు. ఆప్కాస్‌లో ఉన్న మిగిలిన కార్మికులు మొత్తం రూ.21 వేలు వేతనం తీసుకుంటున్నారని, వారితో పాటు పనిచేస్తున్నప్పటికీ సమానపనికి సమానవేతనం ఎందుకివ్వరని ప్రశ్నించారు. కార్మికులు ఐక్యంగా ఉండి న్యాయపోరాటం చేయాలని, అధికారుల బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా పోరాటం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు బాధాకరం

- ఎస్టీ కులస్తుల ఆస్తులు ధ్వంసం చేయడమే ఇందుకు నిదర్శనం
- జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎస్. ప్రసాద్

వినుకొండ: గ్రామాల్లో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందనడానికి గంటవారిపాలెంలో ఎస్టీ కులస్తుల ఆస్తులు ధ్వంసం చేయడమే నిదర్శనమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గంటవారి పాలెం గ్రామంలో సుందరరాజు కుంభ యోగయ్య, చిన్న నాగరాజు, హనుమంతులకు చికెన్‌షాపుతో పాటు ఇళ్లు కూడా జేసీబీతో ధ్వంసం చేయడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమకు ఓట్లు వేయలేదని అక్కసుతో చికెన్ షాపును తీసేయాలని పంచాయతీ కార్యదర్శి చేత నోటీసులు ఇప్పించారన్నారు. తరువాత కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారని, మాకే ఎదురు తిరిగి కోర్టుకు వెళ్తారా అంటూ అర్ధరాత్రి వేళలో జేసీబీతో చికెన్‌షాపు, ఇంటిని కూడా కూలదోసి రూ.18 లక్షలు నష్టపరిచారని వివరించారు. సదరు దృశ్యాలను వీడియో తీస్తున్న బాధిత మహిళ జాకెట్‌లో నుంచి సెల్‌ఫోన్ కూడా లాక్కున్నారని ఇలాంటి ఘటనలు జరిగేందుకు ఊతమిస్తున్నారన్నారు. జరుగుతున్న ఘటనలకు స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బాధ్యత వహించాలని, ప్రజల్లో తిరుగుబాటు వస్తే శాంతి భద్రతలకు కూడా విఘాతం కలుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు కూడా ఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని జేసీబీని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. బాధితుల పక్షాన నిలబడి ప్రైవేటు కేసులు వేస్తామని హెచ్చరించారు. ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసుకున్న ఆస్తులను కూడా ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారని ఇదంతా ఎవరి ప్రోద్బలంతో జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులు మానుకోవాలని సూచించారు. దాడులకు బాధ్యులైన టీడీపీ నాయకులు కొనకంచి వెంకట్రావు, మధు, మురళి, అంజయ్య, గోపు రామకృష్ణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, బేతం గాబ్రియేలు, జానీ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



మాట్లాడుతున్న ఆశ్రమ పీఠాధిపతి



ప్రతిష్ట చేసిన పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ విగ్రహం


శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్ర విజ్ఞాన ఆశ్రమంలో పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ ఆరాధన ఉత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిసినట్లు ట్రస్టు అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది యలవర్తి శ్రీనివాసరావు, సెక్రటరీ దేసు మల్లిఖార్జునరావులు తెలిపారు. ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఉదయం 10.56 నిమిషాలకు ముఖ్య అతిథులు అచలానంద ఆశ్రమ ఒంగోలు పీఠాధిపతి పరిపూర్ణ సిద్ధానంద స్వామి, బ్రహ్మంగారి మఠం తోటపల్లి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వాముల చేతుల మీదగా విగ్రహ ప్రతిష్టా వైభవంగా జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావంతో పాటు సేవా దృక్పథం సత్ప్రవర్తన అలవరుచుకోవాలన్నారు. సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం ద్వారా తత్వబోధ చేశారన్నారు. లోక కల్యాణం కోసం మానవతా సంబంధాలు పెంపొందించారన్నారు. ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ సేవలు కొనియాడారు. వేద పాఠశాల ఉపాధ్యాయులు, వేదపండితులు వడ్లమాని గోవర్ధనచార్యులు, కడియాల ఆంజనేయశాస్త్రి, పూసపాటి నాగేశ్వరరావు శాస్త్రి, కోట వీరబ్రహ్మాచారి, ఉమామహేశ్వరశర్మ, సారథ్యంలో దంపతులచే పూర్ణాహుతి, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్ర రెండు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి గంగమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట వేడుకలు

- 23న అమ్మవారి ప్రతిష్ట
- రూ.50 లక్షల వ్యయంతో నిర్మాణం



గంగమ్మతల్లి ఉత్సవ విగ్రహం



సిద్ధమైన దేవాలయం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి, పోతురాజుల,పేర్పిడి ప్రతిష్టా మహోత్సవ వేడుకలు నేటి నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటి ప్రతినిధి ముంద్రు రాఘవరావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రూ.50 లక్షల వ్యయంతో పార్టీలు, కులమతాలకు అతీతంగా గ్రామస్తులు, దాతలు సహకారంతో దేవాలయ పునః నిర్మాణ పనులు చేపట్టామన్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానం రూ.10 లక్షలు సహకారం అందించినట్లు తెలిపారు. నేటి నుంచి నిర్వహించే ప్రతిష్టా వేడుకల్లో భాగంగా వేదపండితుల వేదమంత్రాల నడుమ దంపతులచే ప్రత్యేక పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 23న గంగమ్మ తల్లి విగ్రహాలు ఉదయం 8.01 నిమిషాలకు ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా జరుగుతుందన్నారు. అదేరోజు భారీ అన్నదాన సంతర్పణ కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. భక్తులందరు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

వాడవాడలా ఘనంగా ఈస్టర్ పర్వదినం



శావల్యాపురంలో ప్రసంగిస్తున్న సీహెచ్ యేహెజ్కేలు



సమాధులను అలంకరించి పూజలు నిర్వహిస్తున్న విశ్వాసులు



ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



వాక్యబోధన చేస్తున్న షాలెం రాజు

శావల్యాపురం: ఏసుక్రీస్తు ప్రభువు మరణం నుంచి లేచిన పర్వదినాన్ని ఈస్టర్ పర్వదినం అని విమోచన ప్రార్థన మందిరం మత బోధకులు సి.హెచ్. యేహెజ్కేలు అన్నారు. ఆదివారం మండలంలోని అన్నీ గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పర్వదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో జరిగిన వేడుకల్లో మతభోధకులు పాల్గొని ఈస్టర్ సందేశాన్ని వివరించారు. మానవుని జీవితం మరణంతో ముగింపు కాదని తదుపరి ఉన్నతమైన ఉత్తమమైన మంచి జీవితం ఉందని ఏసుక్రీస్తు బోధించిన బోధనలు వివరించారు. అనంతరం ప్రార్థన మందిరాల్లో భక్తిగీతాలు అలపించారు. ఈ కార్యక్రమంలో కస్తూరియే హెజ్కేలు నిశాంత్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: క్రీస్తు ఏసు మరణాన్ని జయించి సమాధి నుంచి తిరిగి లేచిన రోజును పురస్కరించుకొని ఆదివారం పునరుత్థాన పండుగను క్రైస్తవ విశ్వాసులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రిష్టియన్‌పాలెంలోని సమాధుల తోటలో తమ తమ పెద్దల సమాధులను అందంగా అలంకరించి క్రీస్తు ఏసు మహిమలను కీర్తిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమాధుల తోటలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి అవసరమని, ఆయన బోధనలు లోకంలో శాశ్వతంగా ఉంటాయన్నారు. లోకానికి ప్రేమ, దయ, క్షమా గుణాలను అందించారని కొనియాడారు. ఈసందర్భంగా లూథరన్ చర్చి సంఘకాపరి ప్రభాకరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ ప్రతినిధులు అన్నవరపు కిషోర్, కొట్టా కిరణ్‌కుమార్, నేలటూరి మురళీ, బచ్చులకూరి క్రాంతికుమార్, ప్రీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి పునరుర్థారుడైన పవిత్ర దినాన్నే ఈస్టర్ పండుగగా ఆనందోత్సవాల నిర్వహించుకోవడం జరుగుతుందని పాస్టర్ బ్రదర్ షాలెం రాజు చెప్పారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో పరిధిలోని చర్చిలు నిండిపోయాయి. ఈస్టర్ సందర్భంగా గుండయ్యతోటలోని నిరీక్షణ ప్రార్థనామందిరం, భావనారుషి నగర్‌లోని తండ్రిసన్నిధి, పురుషోత్తమపట్నం మార్గంలోని ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం, తూర్పుమాలపల్లిలోని పరిశుద్ధ మత్తయ్య చర్చి, సంజీవనగర్‌లోని పరిశుద్ధ పౌలు చర్చి, రాగన్నపాలెంలోని లూథరన్‌చర్చి, సాంబశివనగర్ జీవము గల దేవుని సంఘం, సెయింట్ చార్లెస్ హైస్కూల్ ప్రాంగణంలోని ఆర్సీఎం చర్చిల్లో పాస్టర్లు ఈస్టర్ విశిష్టతను వివరించారు. అనంతరం క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లి దేవుని సన్నిధిలో శాశ్వతంగా నిద్రిస్తున్న తమ పెద్దలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థలు చేశారు. ఈ సందర్భంగా వారి సమాధులకు కుటుంబ సభ్యులతో కలిసి పూలతో అలంకరించుకున్నారు.



పండుగ ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చి పాస్టర్లు ఏసుక్రీస్తు పునరుద్ధానం, ఆయన బోధనలు, విశిష్టతను వివరించారు. ఏసుప్రభు శిలువ ప్రదర్శన నిర్వహించారు. నాదెండ్ల ఎపీఫానియా లూథరన్ చర్చిలో పాస్టర్ బి.మోహనరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గణపవరం హెబ్రోను ప్రార్థనా మందిరంలో పాస్టర్ యడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు జరిపారు. తూబాడులోని పురాతన పునీత వనచిన్నప్ప చర్చిలో పాస్టర్ కాకుమాను మిల్కిన్ రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రాణం తీసిన అద్దె చెల్లింపు వివాదం

- అద్దె దారుడిపై గృహ యజమాని దాడి
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- హత్య కేసుగా మార్పు



నరసరావుపేటటౌన్: దాడిలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ సీఐ హైమారావు ఆదివారం తెలిపారు. దీంతో దాడి కేసును హత్య కేసుగా బదలాయించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బరంపేటకు చెందిన కిషోర్ గృహంలో సి.హెచ్. వెంకటేష్ కుటుంబం గత కొన్ని నెలలుగా అద్దెకు ఉంటున్నారు. అద్దె చెలింపు విషయంలో వెంకటేష్‌కు, కిషోర్‌కు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వెంకటేష్‌పై శనివారం కిషోర్ కర్రతో దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని సమీపంలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.